# 6. జీతం—ధరలు

ఎన్నిసార్లు ఓడిపోయినా విసుగుచెందక దేశంలో ఎన్నికలు మొదలయినప్పట్నుంచి పార్లమెంటు, అసెంబ్లీ, జిల్లాపరిషత్. సమితి పంచాయతీ జెనరల్ మరియు ఉపఎన్నికల్లో పోటీచేసేవాడిలా మళ్ళీ చెట్టుదగ్గరికెళ్ళాడు రాజరత్నం—చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని ఒళ్ళు గీనుకుపోతున్నా ఓర్చుకుంటూ చెట్టుదిగాడు—శవాన్ని భుజంపై మార్చుకొని శ్మశానందిక్కు నడుస్తున్నాడు — క్రమక్రమంగా శవం బరువవుతున్నా లెక్కచేయకుండా అయాసాన్నుచుకొంటూ గమ్యం చేరుకునే ప్రయత్నాన్ని చూసి శవంలోని భేతాళుడొకసారి నవ్వి

"మనిషి! తెల్లగడ్డం, ముఖంపైన మడతలు చూస్తుంటే నువ్వో చిరుద్యోగంచేసి రిటైరైనవాడిలా కనబడుతున్నావు — నీవీ వయసులో నన్ను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించడం నీ కొడుక్కు ఉద్యోగం సంపాదించడానికో లేక నీ కూతురుకు వరున్ని సంపాదించడానికో అయివుంటుంది ..కాదంటవా....?'

రాజరత్నం ఏం మాట్లాడకుండా తనలో తానే గొణుక్కున్నాడు— 'ముప్పైఐదేళ్ళు ఉద్యోగంచేసి తలదాచుకొను చిన్నకొంపైనా కట్టుకోలేని వాన్ని — రిటైరయినా నాకు రిటైరుకాని సమస్యలు — ఎవరితో చెప్పుకోవాలి — ?"

రాజరత్నం నుండి ఏం సమాధానం రాకపోయేసరికి భేతాళుడే కథ చెప్పడం ప్రారంభించాడు—

స్వతంత్రి భారత దేశంలో రావు ఓ ఉద్యోగి — జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో మకాము... సంవత్సరాల తరబడి కిరాయగదుల్లోనే గడు పుతూ ఇబ్బందులు పడుతున్నాడు —రాత్రి పది దాటితే కరెంటుబంద్ - గోడలకు మేకులు దిగగొట్టద్దు.... ఓనరుకు వినబడేట్టు గట్టిగా అరుచుకో వద్దు— కట్టెలపొయ్యి పెట్టొద్దు — ఎక్కువమంది చుట్టాలు రావద్దు — ఇలా సవాలక్ష నిబంధనలు— పైగా ఆర్నెల్లకోసారి అద్దెపెంచడం — ఎవరికి కోపమొచ్చినా ఇల్లు ఖాళీ చేయమనడం — ఇలా పది పంన్నెం డిండ్లు మార్చాడు — అద్దె కొంపలతో విసిగిపోయాడు — స్వతంత్రి దేశంలో ఇంట్లోనైనా కాస్త స్వతంత్రంగా ఉండాలని ఓ స్వంత ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు — తాను రిటైర్ మెంటయితే పిల్లలకు ఆ ఇల్లైనా మిగులుతుందనుకున్నాడు—

అతడాకాశ హర్మ్యాలనేం కోరుకోలేదు —మూడుగదులతో ముచ్చ టగా ఓ చిన్న ఇల్లు కట్టుకుంటే చాలనుకున్నాడు ... అప్పుడే కట్టాలని కూడా అనుకోలేదు — ఐదారేళ్ళలో మెల్లమెల్లగా మూడుగదులకు సరి పోయే డబ్బు కూడబెడితే పి ఎఫ్ లోనుతో ప్లాటు తీసుకొని స్వగృహం నిర్మించుకోవచ్చని ప్లానువేసాడు — దృఢనిర్ణయం తీసుకున్నాడు — సిగరెట్ అలవాటు మానుకున్నాడు—క్యాంటీన్లలో టీ మానుకున్నాడు - అతి మంచిదంపిస్తే తప్ప, తను తన కుటుంబం సినిమాలు చూడడం మానుకున్నాడు...ఇంట్లోకి సామాను కొనరి కొనరి తగ్గించి తేసాగాడు— ఏ ఏడాదికో ఇంక్రిమెంటొచ్చినా పెరిగే జీతం ధరలతో పోటీపడక మరింత సామాను తగ్గించాల్సి వచ్చేది — క్రమక్రమంగా అన్నంలోకి పెరుగు లేకుండా తినడం రెండుసార్లకు బదులు ఒకేసారి టీ తాగడం వరకొచ్చింది— పిల్లలకు చాలాకాలంగా ఓ మంచి డ్రెస్ కుట్టించడం జరుగడంలేదు—

మొదలే అంతంత మాత్రంగావున్న రావ్, అతని భార్య స్వగృహం ఆశతో కంటె ఎముకలు తేలి అస్తి పంజరాల్లా తయారయ్యారు—ఎలా గైతేనేం ఆరేడేళ్ళలో ముప్పైవేలు కూడబెట్టాడు రావు...ఎగిరి గంతేసి ఇల్లు పూర్తయినట్టేనని మురిసిపోయాడు-ముప్పైవేలకు తోడు పదిహేను వేలు నాన్ రిఫండేబుల్ పి ఎఫ్ లోన్ తీసుకున్నాడు —మొదలయితే ఓ ప్లాటుకొందామని బేరంచేసాడు — సిటీకవతల చాలా దూరంలో రెండు కుంటలకు ఇరవై వేలయింది — మునిసిపాలిటి నుండి పర్మిషన్, ఎస్టిమేషన్ ప్లాన్ అన్నింటికి కలిపి ఏడెనిమిది వేలు ఖర్చయింది— ఇక మిగిలింది దాదాపిరవై వేలు...

మూడుగదులకు దాదాపు లక్ష రూపాయలవుతుందని తెలుసుకొని నీరుగారిపోయాడు — తన దగ్గరున్న డబ్బుతో సిమెంటు కూడారాదని తెలుసుకొని షాక్‌తిన్నట్టయ్యాడు — ఈ లోగా విటమిన్ల లోపంవల్ల నీరసంతో రావు భార్య మంచమెక్కింది — పోషకాహారం, బలమైన మందులివ్వందే ఆమె కోలుకోవడం కష్టమని డాక్టర్ చెప్పాడు —ఇల్లు మాట దేవుడెరుగు భార్యను దక్కించుకోవాలని నానా ప్రయత్నాలు చేసి ఉన్న డబ్బులో చాలాభాగం ఖర్చుచేసాడు—మిగిలిన కొంచెం డబ్బును కూతురి పేరుమీద డిపాజిట్‌చేసి ఇల్లు ఆశ వదులుకొని చేతులు దులుపుకున్నాడు —జీవితాంతం అద్దె ఇంట్లో ఉండడానికే నిర్ణయించుకున్నాడు- ప్లాటమ్మి పి ఎఫ్‌లోన్ తీర్చేశాడు—కాలం గడుస్తుంది-పిల్లలు ఖర్చులు పెరుగుతున్నాయి....ప్రతినెలా ఆచి తూచి ఖర్చుచేయడమే జరుగుతుంది రావాల్సిన ప్రమోషనొచ్చినా బాగుండనుకున్నాడు-అయితే లేనివినయం నటిస్తూ, నానా గడ్డితినడం అతనికింత కాలం చేతకాలేదు ... ఇక తప్పదని నానాగడ్డితిని ప్రమోషన్ సాధించాడు—జీతం కొంత పెరిగింది –

ప్రమోషన్ వచ్చింతర్వాత వచ్చిన మొదటిజీతంతో సామాన్ల లిస్టు రాసుకొని దుకాణంకెళ్ళాడు — బిల్లు చూచి నిర్ఘాంతపోయాడు — పోయిన నెలకు ఈ నెలకు ఒక్క కిరాణ సామాన్లలోనే వందపైగా ఎక్కువైంది—ఇక మిగతావాటి సంగతి—? ప్రమోషన్‌తో పెరిగిన నూట పాతిక రూపాయలు రావు కళ్ళముందు కదులుతున్నాయి — బడ్జెట్ సమయం కూడా కాకున్నా ధరలెందుకు పెరిగాయో అతనికర్థంకాలేదు— అదే విషయం షాపు యజమాన్నడిగాడు-

యజమాని అదోలా నవ్వి

"పెట్రోలు ధర పెరిగింది కదాసార్—" అన్నాడు—

ఆ మాటలకు మరింత ఆశ్చర్యపోతూ పెట్రోలు ధరలకూ, కిరాణ వస్తువుల ధరకూగల సంబంధమేంటో అర్థంకాక ఆ విషయం గూర్చే ఆలోచించుకుంటూ ఇంటికొచ్చాడు రావు—

కథ చెప్పడం ఆపాడు భేతాళుడు—

పెట్రోలు ధరకూ, వస్తువుల ధరకున్న సంబంధమేంటి—?
రావుకీ సంబంధం గూర్చి తెలుసా—?

రావు ఎందువల్ల ఇల్లు కట్టలేక పోయాడు—?

రావులాంటి వాళ్ళు దేశంలో ఇండ్లు కట్టుకోగలరా—?

భేతాళుడి ప్రశ్నలకిలా సమాధానం చెప్పసాగాడు రాజరత్నం— 'ఈ సమాజ స్వరూప స్వభావాలు తెలియనివాడికి, జీవితవగాహనలేని వాడికి పెట్రోలు, వస్తువుల ధరలకుగల సంబంధం తెలియదు—ఈ పుణ్యభూమిలో వ్యాపారవేత్తలు ఏ కొంచెం అవకాశం దొరికినా ధరలుపెంచి లక్షలు, కోట్లు గడించాలని చూస్తుంటారు— ప్రకృతి భీభొత్సాలొచ్చినా కరువొచ్చినా, యుద్ధంలాంటి వొచ్చినా, కొత్త బడ్జెటొచ్చినా ఏ చిన్న

అవకాశం దొరికినా ధరలు పెరుగుతాయి - పెట్రోలుతో ధరలెందుకు పెరుగుతాయనడిగితే వాళ్ళిలా చెబుతారు-పెట్రోలు ధర పెరిగితే పెట్రోలియమ్ ప్రొడక్ట్సు మరియు ట్రాన్స్‌పోర్టు చార్జెస్ పెరుగుతాయి-వీటితో వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇలా చిన్న చిన్న సాకులతో ధరలు పెంచుతారు-

రావుకి సంబంధం గూర్చి తెలియదు-లౌక్యం, మోసం తెలియని రావు ఇల్లు కట్టుకోలేక పోయాడు.... కేవలం జీతం పైన్నే ఆధారపడి వుండే రావులాంటి వాళ్ళు దేశంలో స్వంత ఇండ్లు కట్టుకోలేరు ఈ దేశంలో ధరలపై కంట్రోలెవరికీ లేదు.. జీతాలపై మాత్రముంది స్వల్పంగా జీతాలు పెరిగినా అవి ధరలతో ఏ మాత్రం పోటీపడవు నేనూ జీతం పైన్నే బ్రతికిన వాన్ని కాబట్టి నా జీవితంలో ఇల్లు కట్టలేక పోయాను...

రాజరత్నంకు మౌనభంగం అయి తానాశించిన జవాబులు రాగానే శవంతో మాయమై చెట్టెక్కాడు భేతాళుడు

[జీవగడ్డ డిశంబరు 29, 1985]

